క్లుప్తంగా

112 మందికి వైద్య పరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువుతండాలో మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు కృష్ణసాయి, అద్వైత తండాకు చెందిన 112మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ హరికృష్ణ, మాజీ సర్పంచ్ పద్మదూద్యానాయక్ తండా వాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండల పరిధిలోని గ్రామాలలో శుక్రవారం వార్డుల వారీగా రూపొందించిన ఓటరు జాబితాను ప్రదర్శించామని ఎంపీడీఓ ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు పంచాయతీలో ప్రదర్శించిన ఓటరు జాబితాను చూసుకుని, ఏవైనా తప్పుప్పులు ఉన్నా, మార్పులు చేసుకునేందుకు ఈ నెల 14 నుంచి 21 తేదీ వరకు అవకాశం ఉందని, కార్యదర్శి, బీఎల్‌ఓలను సంప్రదించాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్



పిచ్చి మొక్కలతో నిండిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

నిజాంపేట(మెదక్): నస్కల్ గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. మదర్సాకు అనుకొని ఉన్న ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకుపోయాయన్నారు. ఎవరైనా తెలియక అటువైపు వెళ్తే ప్రమాదబారిన పడే అవకాశం ఉందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చెరువు గండి పూడ్చివేత




చెరువు గండిని పూడ్చుతున్న ట్రాక్టర్

కొల్చారం(నర్సాపూర్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలోని మొగుళ్ల చెరువు కట్టకు గండి పడింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దానికి స్పందించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ సునీత వెంకట్ గౌడ్, గ్రామ అధ్యక్షుడు పాషా శుక్రవారం ట్రాక్టర్లతో మట్టిని తీసుకువచ్చి గండిని పూడ్చారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఫణీంద్ర, వెంకటేశం, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళులు

నర్సాపూర్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి స్థానిక సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం నివాళులు అర్పించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. ఏచూరి ఉద్యమ స్ఫూర్తిని, పార్టీ కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భూషణ్, నర్సింహులు, శేఖర్, చంద్రయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను మండల పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను సన్మానించి, సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు రామచంద్రాచారి, హెచ్ఎంలు రాజేశ్వర్, విఠల్, విజయ్‌కుమార్, వేణుశేఖర్ మండల అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, రాష్ట్ర అసో సియేట్ అధ్యక్షుడు చంద్రప్రకాష్, ఉపాధ్యక్షుడు రామకృష్ణాగౌడ్, సత్యకుమార్, రాములు, సంతోష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో అధికారులు ఆదేశాల మేరకు ఓటరు జాబితాను మండల పరిషత్ కార్యాలయంతో పాటు పంచాయితీ కార్యాలయంలో విడుదల చేశారు. మండలంలోని నిజాంపేట, చల్మెడ, రాంపూర్ గ్రామాల్లో ఆయా గ్రామ కార్యదర్శులు ఓటర్ లిస్ట్‌లను పంచాయితీ కార్యాలయానికి అతికించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ రాజిరెడ్డి మాట్లాడుతూ.. అధికారుల ఆదేశాల మేరకు ప్రతి పంచాయితీ కార్యాలయంలో జాబితాను అతికించిన్నట్లు తెలిపారు.

షరా మామూలే..

తప్పుల తడకగా ఓటరు జాబితా



వెల్దుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం, (ఇన్‌సెట్‌లో..) నోటీస్ బోర్డుపై ఓటరు జాబితా

వెల్దుర్తి(తూప్రాన్): ఓటరు జాబితా తప్పులు లేకుండా పకడ్బందీగా చేయాలని ఎన్నికల కమిషన్, జిల్లా రిటర్నింగ్ అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అందుకు భిన్నంగానే ఉంటుంది. తూతూమంత్రంగా సవరించి అధికారులు చేతులు దులుపుకోవడంతో సమస్యలు షరామామూలే అన్నచందంగా తయారైంది. ఇందుకు వెల్దుర్తి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రచురించిన ఓటరు జాబితానే నిదర్శనం.

భర్త ఒక వార్డు.. భార్య మరో వార్డు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను అనుసరించి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఓటరు జాబితాను వార్డుల వారీగా విభజించి ప్రచురించారు. వెల్దుర్తి పంచాయతీ నుంచి మధిర గ్రామాలైన శేరీల, ఎల్కపల్లి గ్రామాలు నూతన పంచాయతీల ఏర్పాటుకు గెజిట్ విడుదల కావడంతో ఆయా గ్రామాల ఓటర్లను మినహాయించి వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని ఓటర్లను 14 వార్డులుగా విభజించారు. అయితే ఏ వార్డు జాబితా చూసినా తప్పులే దర్శనమిస్తున్నాయి. భర్త ఒక వార్డులో ఉంటే భార్య మరో వార్డులో, భార్యాభర్తలు ఒక వార్డులో ఉంటే వారి తల్లిదండ్రులు మరోవార్డులో ఉన్నారు. కొందరికి రెండు వార్డుల్లో, మరికొందరికి ఒక్కో వార్డులోనే మూడు సార్లు పేర్లు నమోదయ్యాయి. వార్డుల విభజనలోనూ ఇష్టారాజ్యంగా చేపట్టారు. కాలనీకి సంబంధం లేని వ్యక్తులను వార్డుల్లో చేర్చి అదే వార్డులోని ఓటర్లను మరోవార్డులో చేర్చారు.

తప్పులు సవరించుకోండి: ఎంపీడీఓ

ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే ఈనెల 21 వరకు సవరించుకోవచ్చని ఎంపీడీఓ ఉమాదేవి పేర్కొన్నారు. ఒక కుటుంబంలోని ఓట్లు ఒకే వార్డులో కాకుండా వేరే వార్డుల్లోనూ ఉంటే లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి పరిష్కరిస్తాం. సవరణలు పూర్తయ్యాక తుది జాబితాను ఈనెల 28న పంచాయతీ కార్యాలయం వద్ద వార్డుల వారీగా ప్రచురిస్తాం.

టాయ్‌లెట్ల నిరుపయోగం

- ముందుకు రాని నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లు

నర్సాపూర్: స్వచ్ఛ మరుగుదొడ్ల పథకం కింద నిర్మించిన రెండు భవనాలు ఏడాదిన్నర నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ప్రాంతాలలో నిర్మించకపోవడం వల్ల వాటిని నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ మరుగుదొడ్ల పథకం కింద ఒక్కో మరుగుదొడ్డి భవనానికి రూ.12లక్షలు కేటాయించి మూడు చోట్ల భవనాల నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు సైతం నత్తనడకన సాగాయి. పూర్తి చేశాక ఏడాదిన్నర క్రితం పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు వాటిని ప్రారంభించారు. ఒక మరుగుదొడ్డి భవనం ఉపయోగంలోకి తెచ్చిన అధికారులు మరో రెండింటిని వినియోగంలోకి తేవడంలో విఫలం చెందారు.

ముందుకురాని నిర్వాహకులు

ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఒకటి, తూప్రాన్ రహదారిని ఆనుకుని కోమటి కుంట వద్ద మరో దానిని నిర్మించారు. కాగా బస్టాండులో ఇప్పటికే మరుగుదొడ్లు ఉన్నాయి. అలాగే తూప్రాన్ రహదారిపై కుంట పక్కన నిర్మించడంతో అక్కడ రద్దీ తక్కువగా ఉంటుంది. దీంతో వాటి నిర్వహణకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఈ విషయమై మున్సిపల్ మేనేజర్ మధుసూదన్‌ను వివరణ కోరగా రెండు మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలువురు బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండల కేంద్రానికి చెందిన మంజుల, నవీన్, పొట్టి వెంకటి, వంజరి వెంకటి, రామకృష్ణకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మంజూరు చేయించినట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను వారి కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

కౌడిపల్లి(నర్సాపూర్): క్రీడలలో గెలుపోటములు సహజమని తునికి ఎంజేపీ బీసీగురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరిబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని తునికి ఎంజేపీలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 13ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఆటలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పీడీ రమేశ్‌కుమార్, పీఈటీలు పూర్ణచందర్, శేఖర్, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్‌లో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు ప్రారంభించామని ఫిజికల్ డైరెక్టర్ సుజాత చెప్పారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ఏడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలలో పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఆయా పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

రామాయంపేట(మెదక్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రామాయంపేటలో వాలీబాల్ పోటీలు జరిగాయి. జూనియర్, సీనియర్ విభాగంలో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈపోటీల్లో సుమారు మూడు వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఫెడరేషన్ కన్వీనర్ నాగరాజు తెలిపారు. గెలిచిన జట్లకు బహుమతులు అందజేశారు.

అద్దె చెల్లించలేదని షాప్ సీజ్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ దుకాణ సముదాయంలోని 12వ నంబర్ షాప్‌ను అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఈ షాప్‌లో గాజుల దుకాణం నిర్వహిస్తుండగా, జీపీ సిబ్బంది సామగ్రిని సంచులలో నింపి సీజ్ చేశారు. 30 నెలల అద్దె బకాయి పడడంతో దుకాణం షటర్‌కు తాళం వేసి సీజ్ చేసినట్లు గ్రామపంచాయతీ ఈఓ సంతోష్ కుమార్ తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

కొల్చారం(నర్సాపూర్): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని అప్పాజీపల్లి లో చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మల్లేశంగౌడ్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దయాకర్‌గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి నాని, బూత్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ హిందీ భాష పై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

ఎంపీడీఓ శ్రీనివాస్



పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రమైన కౌడిపల్లిలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న నీటితొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి బొండాలలో నీరునిలువ లేకుండా చూడాలని, దోమలు పెరగకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, అంగన్‌వాడీ టీచర్లు ఫరీద, సుమిత్ర, నిర్మల, ఆశా వర్కర్ చెన్నమ్మ, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన



పెద్దశంకరంపేటలో సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

పెద్దశంకరంపేట(మెదక్): వినాయక నవరాత్రులను పురస్కరించుకొని ఆయా మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్థానిక మాధవనగర్ కాలనీలో మండపం వద్ద సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జీపీలలో ఓటరు జాబితా ప్రదర్శన



చేగుంట(తూప్రాన్) : ఓటర్ల జాబితా ఏర్పాటు చేస్తున్న ఎంపీడీఓ చిన్నారెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వద్ద అధికారులు ప్రదర్శించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంతోపాటు 29 గ్రామ పంచాయతీల వద్ద జీపీ ఓటరు జాబితా, వార్డుల విభజన జాబితాను ప్రదర్శించారు. ఓటరు జాబితాపై ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు తెలుపాలని చిన్నశంకరంపేట, నార్సింగి ఎంపీడీఓలు దామోదర్, ఆనంద్ తెలిపారు.

చేగుంట(తూప్రాన్): మండల పరిషత్ అధికారుల ఆధ్వర్యంలో ఓటర్ల ముసాయిదా జాబితాను గ్రామ పంచాయతీల నోటీస్ బోర్డుల్లో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలతోపాటు ఎంపీడీఓ కార్యాలయంలో వార్డుల వారి ఓటరు జాబితాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలోఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శ్రీశైలం, విజయ్ కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటోలకు నంబర్లు వేయిస్తున్న పోలీసులు

పెద్దశంకరంపేట(మెదక్): ఆటోడ్రైవర్లు తప్పకుండా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఆటోలకు మండల, జిల్లా స్థాయి నంబర్లను కేటాయించారు. ఆటోకు ఇరువైపులా నంబర్లను కేటాయించడం వల్ల నేరాలు జరిగే అవకాశం ఉండదన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆటోడ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు.

ప్రతి ఒక్కరూ ఓటును సరి చూసుకోండి



చెట్లగౌరారంలో ఓటరు లిస్టును చూపుతున్న గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతి ఒక్కరూ తమ ఓటును సరిచూసుకోవాలని, సమస్యలుంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీఓ లక్ష్మీనర్సయ్య అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ సభలో గ్రామస్తులతో మాట్లాడారు. తమ ఓటు ఉందా లేదా? ఎవైనా సమస్యలున్నాయా తదితర అంశాలను సరిచూసుకోవాలన్నారు. చెట్లగౌరారంలో ప్రజాప్రతినిధులు ఓటర్ల లిస్టును పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల వద్ద ఓటర్ల లిస్టును ప్రదర్శించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంజమ్మ

చిన్నశంకరంపేట(మెదక్): మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అంజమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని భాగీర్థిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో భవితకు బాటలు

పాపన్నపేట(మెదక్): బాల్యం నుంచి నిర్వహించే పోటీ పరీక్షలు భవితకు బంగారు బాటలు అవుతాయని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పాపన్నపేటలో నవయువ సేవా సంఘం ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం మండపం వద్ద మహిళలు వినాయకునికి కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై సంగన్న, మాజీ సర్పంచ్ గురుమూర్తిగౌడ్, నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మాజీ ఎమ్మెల్యే పూజలు

నర్సాపూర్: హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించిన మహా గణపతికి స్థానిక మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శుక్రవారం పూజలు చేశారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకుని ప్రతిష్ఠించే అతి పెద్ద వినాయకుడైన ఖైరతాబాద్ వినాయకునికి మదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

◆ ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్: విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నర్సాపూర్ సబ్ డివిజన్ ఆర్టిజన్ జేఏసీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం జేఏసీ కమిటీ ఏర్పాటు చేసుకున్నామని ఆర్టిజన్ కార్మికుల జేఏసీ కమిటీఅధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నారని చెప్పారు. సమ స్యల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. డివిజన్ ఉపాధ్యక్షుడిగా నాగరాజు, మురళి, సురేశ్, శ్రీనివా స్, రాములు, గౌరీశంకర్‌లతో పాటు పలువురిని కమిటీ ప్రతినిధులుగా ఎన్నుకున్నారని తెలిపారు.

◆ వార్డులవారీగా ఓటరు జాబితా

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లితో పాటు వివిధ గ్రామాలలో శుక్రవారం గ్రామ పంచాయతీల వద్ద ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. గ్రామపంచాయతీతోపాటు మండలంలో కొత్తగా ఏర్పాటు కానున్న ఆరు గ్రామ పంచాయతీలకు కూడా వార్డులవారీగా ఓటర్లను విభజించి ప్రదర్శించారు. ఒకే కుటుంబంలోని ఓటర్లు ఒకేచోట లేకున్నా, ఇతర వార్డులోకి ఓట్లు బదిలీ అయిన లేదా ఇతర అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని చెప్పారు.

◆ చెరువు కబ్జా స్థలాన్ని కాపాడండి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముత్రాజ్‌పల్లి పెద్ద చెరువు స్థలం కబ్జాకాకుండా కాపాడాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు, చెరువు ఆయకట్టు దారుల సంఘం మాజీ అధ్యక్షుడు సున్నం సతీశ్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పెద్దచెరువు అలుగుపారే స్థలం, పంట కాలువ స్థలాన్ని గ్రామ నాయకుడు కబ్జా చేశాడన్నారు. కట్ట ధ్వంసం చేసి రోడ్డు వేశారని తెలిపారు. కబ్జా స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌తో పాటు నీటి పారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

◆ నేరాల నియంత్రణకు చర్యలు

వెల్దుర్తి(తూప్రాన్): ఎస్పీ ఆదేశాల మేరకు వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. ఏదైనా ప్రమాదం జరిగితే సులభంగా గుర్తించేందుకు మండల కేంద్రం వెల్దుర్తి నుంచి తూప్రాన్, నర్సాపూర్, మెదక్ వైపు వెళ్లే ఆటోలకు పోలీస్ శాఖ తరఫున నలువైపులా సీరియల్ నంబర్‌లను ముద్రించారు. వాహన యజమానుల వివరాలను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేశారు. ఆటో డ్రైవర్‌లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

◆ శాంతియుతంగా నిమజ్జనం

పాపన్నపేట(మెదక్): ప్రజలు శాంతియుతంగా వినాయక నిమజ్జనోత్సవాలు జరుపుకోవాలని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చెరువులు నిండుగా ఉన్నందున, నిమజ్జన సమయంలో పిల్లలను తీసుకెళ్లొద్దని సూచించారు. రాత్రి అయ్యేలోపు నిమజ్జనాలు చేయాలని, డీజే సౌండ్‌లు పెట్టొద్దన్నారు.

◆ వినాయక పూజల్లో మైనంపల్లి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మహంకాళీ ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు నవీన్, యువ నాయకులు సంద్రుగు సతీష్, ఉసికె శ్రీనివాస్, ఉదయ్ భాస్కర్ పూజారి రాఘవేంద్ర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రతిజ్ఞ

నిజాంపేట(మెదక్): మండల పరిలలోని నస్కల్‌లోని మూడవ అంగన్ వాడీ సెంటర్‌లో శుక్రవారం జాతీయ పోషణ మాసం పురస్కరించుకొని పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆయా శోభారాణి, విద్యార్థులు వారి తల్లులు పాల్గొన్నారు.

◆ వార్డులవారీగా జాబితా

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో వార్డులవారీగా ఓటర్ జాబితా అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. శుక్రవారం అల్లాదుర్గం ఎంపీపీ కార్యాలయంలో మండలంలోని పంచాయతీల ఓటర్ లిస్టులు నోటీస్ బోర్డుపై అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటర్ లిస్టులో ఏవైన తప్పులు, కుటుంబ సభ్యుల పేర్లు వేర్వేరు వార్డుల్లో ఉంటే దరఖాస్తు చేసుకుంటే ఒకే వార్డులో చేర్చేయత్నం చేస్తామన్నారు. ఈనెల 21 వరకు తప్పుల సవరణ అవకాశం ఉందన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. గొట్టిముక్కులకు చెందిన ప్రవంతికి రూ.14,500 ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం అందజేశారు. అనంతరం పలు మండపాల వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, మాజీ రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ దత్తు, శంకర్‌గౌడ్, రాజు, యాదుల్, కోణం అంజయ్య తదితరులున్నారు.

◆ ఉచిత వైద్య శిబిరం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందాపూర్‌లో శుక్రవారం మెడిసిటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు సమస్యలతో పాటు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచి తంగా మందులు అందించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స చేస్తామని పీఆర్‌ఓ సంజయ్ తెలిపారు.

◆ నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిల్వనీటితో దోమలు, క్రిములు చేరి సీజనల్ వ్యాధులకు కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.